పార్క్ స్థలాన్ని పరిరక్షించండి



ధర్నా చేస్తున్న సాయినిలయ రెసిడెన్సీ కాలనీ వాసులు



పార్క్ స్థలంలో వెలిసిన ప్రహరీ

మేడ్చల్: రూ. కోట్లు విలువైన పార్క్ స్థలాన్ని అక్రమార్కులు కాజేయాలని చూస్తున్నారని మేడ్చల్ చెక్ పోస్ట్ లోని సాయినిలయ రెసిడెన్సీ కాలనీ వాసులు ఆదివారం పార్క్ స్థలం ఎదుట ధర్నా నిర్వహించారు. పార్క్ స్థలం వద్ద శిబిరం ఏర్పాటు చేసుకుని పార్క్ స్థలాన్ని రక్షించాలని కోరుతూ ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సాయినిలయ రెసిడెన్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ చెక్‌పోస్ట్ లోని సర్వే నంబర్ 882,873లోని 13 ఎకరాల్లో 2010 లో వెంచర్ ఏర్పాటు చేశారని ఆ సమయంలో వెంచర్‌లోని ప్లాట్ నెంబర్లు 111,112,113,114,115,116 లలో 1970 గజాలను పార్క్ కేటాయిస్తున్నట్లు చూపారని ఆతర్వాత రికార్డులను తారుమారు చేసి అందులోని 400 గజాల స్థలంను మంచిర్యాల మున్సిపాలిటీకి చెందిన రాజు అనే కౌన్సిలర్‌కు విక్రయించాచినట్లు తెలిపారు. శివరాత్రి పండగ రోజు రాత్రికి రాత్రి 200 గజాల చొప్పున రెండు ప్లాట్లలో ప్రహరీలు నిర్మించి కబ్జా చేశారని ఆరోపించారు. ఈ విషయంపై గతంలో మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ చేశారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అన్యాక్రాంతమవుతున్న సాయినిలయ రెసిడెన్సీ పార్క్ స్థలాన్ని ఉన్నతాధికారులు కాపాడాలని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నర్సింలు, రాంచందర్ కోరారు.

ఎలాంటి ఆక్రమణలు లేవు..

సాయినిలయ రెసిడెన్సీ పార్క్ స్థలంలో ఆక్రమణలు లేవని వెంచర్ నిర్మాణ ప్రతినిధులు తెలిపారు. వెంచర్‌కు ముందు పట్టాదారులు, పీటీ ఉన్న వారి మధ్య వివాదాలు తలెత్తడంతో సమస్య కోర్టు వరకు వెళ్లిందన్నారు. ఎన్ఓసీ వచ్చాక ఎవరి ప్లాట్‌లు వారికి కేటాయించామని, పార్క్ కు కేటాయించిన స్థలం అక్కడే ఉందని దానిని అభివృద్ధి చేసి మున్సిపాలిటీకి అప్పగిస్తామని వారు పేర్కొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ వరలక్ష్మి తదితరులు

ఘట్‌కేసర్: ఓటు హక్కుపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని చౌదరిగూడ మాజీ సర్పంచ్ నక్క వరలక్ష్మి అన్నారు. అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం నిర్వహించిన పూలమాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్బండ వర్గాల్లో ఓటు చైతన్యం వస్తే రాజ్యాధికారం మన చేతుల్లోని ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు తమ ఓట్లను తామే వేసుకొని రాజ్యాధికార సాధనకు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసు, నర్సింగ్‌రావు, రాందాస్, శ్రీనివాస్, అశోక్‌గౌడ్, రాజేశ్‌కుమార్, శ్రీధర్, శ్యామ్, సంజయ్, వెంకటేశ్వర్లు, ఆనంద్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవ వైభవం

• కీసర గుట్టలో ప్రత్యేక పూజలు • దేవాలయానికి పోటెత్తిన భక్తులు



కీసర: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవరోజైన ఆదివారం కీసరగుట్ట స్వామి సన్నిధిలో వేదపండితులు విశేష పూజలను నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో మహాన్యాస పూర్వకరుద్రాభిషేకం అనంతరం లోకంలోని ప్రజల ఆకలిబాధను (క్షుద్బాధ) తీర్చాలని పరమశివుడికి అన్నాభిషేకాన్ని నిర్వహించారు. మరో పక్క యగశాలల్లో రుద్రస్వాహకార హోమాన్ని నిర్వహించారు. అమావాస్య కావడంతో చేత స్వామివారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సాముహిక అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనానంతరం ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలోని శివలింగాలకు పాలు,పసుపు, కుంకుమ, నూనె, నెయ్యిలతో అభిషేకాలు చేశారు. రాత్రి ప్రదోషకాల పూజ, హారతి, మంత్రపుష్పం పూజలను నిర్వహించారు. రాత్రి 8గం. శ్రీస్వామివారికి వసంతోత్సవం, పుష్పయాగం, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ నరేందర్, ఫౌండర్‌ట్రస్టి సభ్యులు, ట్రస్టుబోర్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



నేటితో ముగియనున్న ఉత్సవాలు

కీసరగుట్ట బ్రహోత్సవాలు నేటితో (సోమవారం) ముగియనున్నాయని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం తెలిపారు. సోమవారం దేవాలయంలో ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం క్షేత్రదిగ్బలి, పూర్ణాహుతి, పండిత సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి.





స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం



కీసర జాతరలో పల్లవి ఫౌండేషన్ సేవలు

పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



కీసర: పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కీసరగుట్ట జాతరకు విచ్చేసిన భక్తులకు 10 వేల పండ్ల కిట్స్, లక్ష వాటర్ బాటిల్స్ అందించినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు, ఢిల్లీ పబ్లిక్ సీఈవో మల్క యశస్వి తెలిపారు. ఆదివారం కీసరగుట్టలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి స్కూల్స్ సహకారంతో జాతరకు వచ్చే భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. తన తండ్రి మల్క కొమరయ్య స్ఫూర్తితో ఫౌండేషన్ తరఫున నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతి రథానికి ప్రత్యేక పూజలు



ఘట్‌కేసర్‌లో స్వామివారిని దర్శించుకున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య దంపతులు, ముత్యాలుయాదవ్

ఘట్‌కేసర్: యాదాద్రి శ్రీ లక్ష్మీనర్సింహ్మ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బర్కత్‌పూర యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి బయలు దేరిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి అఖండ జ్యోతి రథం ఆదివారం ఘట్‌కేసర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారికి ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అఖండ జ్యోతి రథం సోమవారం సాయంత్రానికి యాదాద్రికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. మున్సిపాల్ చైర్ పర్సన్ దంపతులు పావనీయాదవ్, జంగయ్య, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, వందన మహిపాల్‌రెడ్డి, మారెం లక్ష్మారెడ్డి, కౌన్సిలర్ మల్లేశ్, విజయ్‌గుప్త, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, యాదగిరి, రాజు, సంజీవముదిరాజ్, శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

అవుషాపూర్‌లో...

అవుషాపూర్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, స్థానికులు అఖండ జ్యోతి యాత్రకు మంగళహారులతో స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, భిక్షపతిగుప్తా, భానుప్రకాశ్, ప్రవీణ్, సురేశ్ , స్థానికులు ఉన్నారు.

సమస్యల వలయంలో సద్భావన టౌన్‌షిప్



మాట్లాడుతున్న సద్భావన టౌన్‌షిప్ వాసులు

పోచారం: పోచారంలోని సద్భావన టౌన్‌షిప్‌లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సద్భావన టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీవాసులు మాట్లాడుతూ.. గత 15 రోజులుగా లిఫ్టుల నిర్వహణ బాధ్యతను హౌసింగ్ బోర్డు ప్రతినిధులు గాలికి వదిలేశారన్నారు. లిఫ్టుల నిర్వహణ కాంట్రాక్టు గడువు ఓటీఎస్ కంపెనీతో ముగియడంతో తదుపరి ఆ బాధ్యతలు ఎవరికీ అప్పగించకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనని ఫ్లాట్ ఓనర్లు భయపడుతున్నట్లు తెలిపారు. దీనికి తోడు సీసీ కెమెరాలు పని చేయడం లేదని, వాటర్ లీకేజీలు, స్వీపేజీల కారణంగా భవనాలు పాడైపోతున్నాయన్నారు. ఎస్‌టీపీ సామర్థ్యం తగ్గిపోయిందని, దాని స్థానంలో కొత్తది నిర్మించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పనులు పూర్తి చేశాకే ఫ్లాట్లను యజమానులకు హౌసింగ్ బోర్డు అందజేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు మరమ్మతుల నిమిత్తం ఇటీవల రూ. 1.30 కోట్లు కేటాయించినా క్షేత్రస్థాయిలో పనులు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సద్భావన టౌన్‌షిల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాలనీవాసులు విప్పర్తి సురేష్, ఎ.ప్రశాంత్, గోపాలరావు, త్యాగరాజు, రవీందర్, కిరణ్‌కుమార్, శ్రవణ్‌కుమార్, వెంకట్‌స్వామి, దివాకర్, నందకుమార్, సాయికిరణ్, శశికిరణ్, రామకృష్ణ కుమార్, ప్రసాద్, వెంకటేశ్ గౌడ్, లక్ష్మణ్, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న మల్లన్న

మేడ్చల్: రాష్ట్ర మున్నూరుకాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని నిమ్మల గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు, సంఘం నాయకులు పాల్గొన్నారు. సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలోని, హైద్రాబాద్ లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న మున్నూరుకాపు కులానికి చెందిన ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకుడు తీన్మార్ మల్లన్న, జాయింట్ కలెక్టర్ టీఎస్‌పీఎస్ మాజీ సభ్యులు కోట్ల అరుణకుమారి, నాగర్ కర్నూల్ జిల్లా వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శృతి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సత్యనారయణ, ప్రధాన కార్యదర్శి వెంకటకిషన్, రమేష్, రేలారే గంగ,స్వాతి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

చిలుకానగర్ అభివృద్ధికి కృషి

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో రూ.కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అన్నారు. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికైన గీతను హైకోర్టు కాలనీ మహిళలు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే అధికారులను సమన్వయం చేసుకుంటూ డివిజన్ అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు వెచ్చించినట్లు తెలిపారు. స్థానికుల మద్దతుతో డివిజన్‌ను మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

సీనియర్ సిటిజన్స్‌కు బహుమతుల ప్రదానం

మేడిపల్లి: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్స్ పోటీల్లో సీనియర్ సిటిజన్స్ ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం బుద్ధానగర్‌లో బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ మద్ది యుగేందర్ రెడ్డి, అంతర్జాతీయ క్యారమ్ ఆటగాడు కె.శ్రీనివాస్ విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ..సీనియర్ సిటిజన్స్‌కు ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఆటలతో మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు.ఇలాంటి పోటీలను క్రమంతప్పకుండా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.

అక్రమ బ్లాస్టింగ్ మెటీరియల్ నిల్వలపై ఎస్‌ఓటీ దాడులు



స్వాధీనం చేసుకున్న బ్లాస్టింగ్ మెటీరియల్

కీసర: రాంపల్లి గ్రామంలో అక్రమంగా ఇంట్లో బ్లాస్టింగ్ మెటీరియల్ నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ, కీసర పోలీసులు సంయుక్తంగా దాడి చేసి నిందితుడు పల్లపు సురేష్‌ను అరెస్ట్ చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన బ్లాస్టింగ్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళల ప్రాధాన్యం పెరగాలి

బోడుప్పల్: సమాజంలో మహిళల ప్రాధాన్యత పెరగాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. బోడుప్పల్ ఎస్ఎస్ఎస్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిలా సిబ్బందికి వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు, ఉత్తమ ప్రతిభ కనపర్చిన పారిశుద్ధ్య సిబ్బందికి బహుమతులు అందజేశారు. మహిళ కార్పొరేటర్లు, ఉద్యోగులు, సిబ్బందిని శాలువలతో సత్కరించి ప్రశంసా పత్రం, మెమోంటోలతో సత్కరించారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. వీరికి మందముల పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గుడిసె సాయి,రాంపల్లి సాయి, మధు, విన్నూ, టిల్లు ఉన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ ఓబీసీ చైర్మన్ బొంగోని ఉమేష్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కప్పెర సాయి, గడ్డం వినీష్, జయంత్, గణేష్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మల్లాపూర్ మాజీ వార్డు కమిటీ సభ్యులు పీఆర్.ప్రవీణ్ అన్నారు. మహనీయుడికి మణిహారం కార్యక్రమం 388వ ఆదివారానికి చేరిన సందర్భంగా మల్లాపూర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షులు పర్నాటి వెంకట్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కర్రె శంకర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘువరన్, ముఖ్య సలహాదారు పీజీ. సుదర్శన్, పెగుడ నరసింహా, సభ్యులు తునికి నరసింహ, విశ్వనాథం, సురేందర్, బాల చందర్, జితేందర్ పాల్గొన్నారు.